క్లుప్తంగా

శ్రీకృష్ణుని ఆలయానికి శ్రీధర్మ ఫౌండేషన్ విరాళం

మునగపాక: మునగపాకలోని సంతబయిలులో శ్రీకృష్ణుని ఆలయ అభివృద్ధి కోసం శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ తనవంతు సాయంగా రూ.50 వేలు విరాళం అందజేశారు. నూతనంగా నిర్మించిన ఆలయం మరింత అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో సాయికృష్ణ ఈ విరాళాన్ని అందజేశారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విల్లూరి నూకనరసింగరావు, కర్రి కోటి, వెలగా శ్రీనివాసరావు, శరగడం జగన్నాథరావు, దాడి భీమునాయుడు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో ఘనంగా సీపీఐ వందేళ్ల వేడుక



వేడుకలో పాల్గొన్న సీపీఐ నాయకులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం సీపీఐ 100 సంవత్సరాల వేడుక ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు నాయుడు, మల్లికార్జునరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సీపీఐ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు డొక్కా పరదేశి, ముప్పిడి గోవింద, డొక్కా సూరప్పారావు, డొక్కా కామరాజు, లక్ష్మి, సత్యనారాయణ, ముప్పిడి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

సుంకపూరులో మేలుకొలుపు



మేలుకొలుపులో పూజలు చేస్తున్న భక్తులు

కోటవురట్ల: మేలుకొలుపు కార్యక్రమాలు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. సుంకపూరు గ్రామంలో మేలుకొలుపు శుక్రవారం నిర్వహించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో దేవుడి చిత్రపటాలతో తిరుగుతూ సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలంటూ ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక: పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలని కోరుతూ శుక్రవారం మునగపాకలో కుంగిన రోడ్డు వద్ద సీపీఎం నేతలు ఆందోళనకు దిగారు. పార్టీ జెండాలు పట్టుకొని కుంగిన రోడ్డు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ప్రజా సంఘాల పోరాటం ఫలితంగా అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలో మీటర్ల రోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. అయితే ఈ రోడ్డుపై భారీ వాహనాల రాకపోకల కారణంగా మునగపాక సమీపంలో రోడ్డు కుంగిపోయిందన్నారు. తద్వారా ప్రమాదాలకు నిలయంగా మారుతుందన్నారు. జిల్లా అధికారులు స్పందించి కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎస్.బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ, కాశీ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్



చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

పాయకరావుపేట: పట్టణంలోని చిత్ర మందిర్ థియేటర్ వెనుక ఉన్న ఐ ఓపెనర్స్ చర్చిలో గురువారం రాత్రి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐ ఓపెనర్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సంఘ యూత్ సభ్యులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ జాన్ డేవిడ్ ఏసు సందేశాన్ని వినిపించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం



పాయకరావుపేటలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన

ఇది బాదుడు ప్రభుత్వమే : మాజీ ఎమ్మెల్యే జోగులు ధ్వజం



పాయకరావుపేటలో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఏఈఈకి వినతిపత్రం అందిస్తున్న సమన్వయకర్త కంబాలు జోగులు, చిక్కాల, వీసం తదితరులు

పాయకరావుపేట: విద్యుత్ చార్జీల పెంపుపై జనాగ్రహం పెల్లుబికింది. శుక్రవారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజానీకం నినదించింది. పాయకరావుపేటలో వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాయకరావుపేట వైజంక్షన్‌లో ఉన్న పార్టీ కార్యాలయం నుంచి ట్రాన్స్ ఏడీఈ కార్యాలయం వరకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టే చార్జీల పెంపుదలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచే ప్రసక్తి లేదని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు హామీలు ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసి విద్యుత్ చార్జీలను పెంచారని మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో పెన్షన్లు పెంపు తప్ప మిగతా వాటిని గాలికి వదిలేశారన్నారు. ఇది బాదుడు ప్రభుత్వమేని స్పష్టమైందన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై సబ్ కమిటీ వేయడం సిగ్గుచేటన్నారు. విద్యా సంవత్సరం ముగిసినా అమ్మఒడి ఇవ్వలేదన్నారు. సీజన్ ముగిసినా రైతులకు రైతు భరోసా లేదన్నారు. వేట విరామం ముగిసి ఆరు మాసాలు గడిచినా మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కేవలం ఓట్ల కోసమే ఈ హామీలన్నీ ఇచ్చారన్నారు. ప్రశ్నిస్తానని చెబుతున్న పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎవరిని ప్రశ్నిస్తున్నాడని కంబాల నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఈ ఆరు మాసాల్లో కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి అరెస్టులు చేయించడంలోనే నిమగ్నమైందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీనియర్ నాయకులు బొలిశెట్టి గోవిందు, దత్తుడు సీతబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రజలపై ధరల భారం మోపుతున్నారన్నారు. కూటమి పార్టీలకు ఎందుకు ఓట్లేశామా? అని ప్రజలు బాధపడేలా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. దోచుకో, పంచుకో, దాచుకో అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాలు అటకెక్కేశాయన్నారు. వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ఎస్సీలకు ఒక్క రూపాయి కూడా చార్జీలు విధించలేదని, ఈ ప్రభుత్వం వచ్చేక పాత బాకీలతో సహా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, ఎస్.రాయవరం జెడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, పట్టణ శాఖ అధ్యక్షుడు దనిశెట్టి బాబి, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపలి సాయిబాబా, నక్కపల్లి మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీను, జగతా శ్రీను, వంగలపూడి రాము, పన్నీరు బాబ్జి, మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు లొడగల చంద్రరావు, కొంతం నరేష్, పల్లేల లచ్చబాబు, జి.చక్రరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, బి.గోవిందు, రాజేష్ ఖన్నా, కొణతాల శ్రీను, వేగేశ్న చంటి, గొర్ల గోవిందు, జి.నర్సింహమూర్తి, నాలుగు మండలాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల కోసం ఎందాకైనా..

- కేసులకు భయపడేది లేదు
- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



నక్కపల్లి: ప్రజల కోసం ఎందాకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని, కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వాటిని ప్రశ్నిస్తారనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియాపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని అణిచి వేయాలని చూస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రతి మంగళవారం ఐదు వేల కోట్ల రూపాయల అప్పులు మాత్రం చేస్తున్నారన్నారు. ఆరు మాసాల్లో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని చెప్పి ఊరూరా బెల్టుషాపులు ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని చెప్పి టన్నుకు రూ.1225ల చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. మండల కేంద్రాల్లో డిపోలు ఏర్పాటు చేసి టన్నుకు రూ.800 చెల్లించి తీసుకెళ్లాలని చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను రద్దు చేసి, పేదలకు వైద్య విద్య అందకుండా చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను నానా ఇబ్బందులు పెడుతున్నాయని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా ఇక నుంచి నిరంతరం ప్రజల్లోనే ఉంటామని, ప్రజా సమస్యలపైనే పోరాటం చేస్తామన్నారు.

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు



యలమంచిలిలో ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, వైఎస్సార్‌సీపీ నేతలు

- ఎన్నికల హామీలన్నీ అటకెక్కించారు
- పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి
- వైఎస్సార్‌సీపీ పోరుబాటలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు
- ఆందోళనకు నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన నేతలు



విద్యుత్ శాఖ ఏడీఈ సూర్యప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కన్నబాబురాజు



యలమంచిలిలో పార్టీ జెండా, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

యలమంచిలి రూరల్: ఆచరణ సాధ్యం కాని హామీలు, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అటకెక్కించారని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కన్నబాబురాజు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం యలమంచిలి పట్టణంలో పెంచిన కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా భారీ ఆందోళన నిర్వహించారు. ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టిన నాయకులు కూటమి ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి, పెంచిన కరెంటు చార్జీలకు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. స్థానిక విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయానికి వెళ్లిన ఆందోళనకారులు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కె.సూర్యప్రకాష్‌కు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ ఆర్నెళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో గెలవడానికి అనేక మోసపూరిత హామీలిచ్చిన కూటమి నేతలంతా వాటిని మర్చిపోయారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన అన్ని పథకాల అమలును నిలిపివేయడం దారుణమన్నారు. సామాజిక భద్రతా పింఛన్లు మినహాయిస్తే ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. పింఛన్ల భారాన్ని తగ్గించుకోవడానికి ఇటీవల తనిఖీలు చేయిస్తున్నారన్నారు. రైతు భరోసా, చేయూత, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, భరోసా, వాహనమిత్ర, కాపు నేస్తం.. ఇలా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ నిలిపివేయడంతో పాటు కూటమి నాయకులు ఎన్నికల ముందిచ్చిన వందలాది హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మరోసారి రాష్ట్ర ప్రజల్ని మోసగించారన్నారు. ఎన్నికల ముందు ఎన్నో ప్రసంగాలు ఇచ్చి ప్రజలతో ఓట్లు వేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రస్తుతం నోరు మెదపకపోవడం దురదృష్టకరమన్నారు. పేద ప్రజల నడ్డి విరిచేలా ఇటీవల పెంచిన కరెంటు ఛార్జీలను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేలా దేవుడు చంద్రబాబు మనసు మార్చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి పట్టణ, మండల, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, కిషోర్ రాజు, దేశంశెట్టి శంకర్రావు, ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక, అచ్యుతాపురం జెడ్పీటీసీలు పెంటకోట సోము, లాలం రాము, యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, జిల్లా పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాధరావు(యూటీఆర్), పార్టీ సీనియర్లు గొట్టుముక్కల శ్రీనుబాబు, నెట్టెం సత్యనారాయణ, సేనాపతి రాము, కోన బుజ్జి, నర్మాల కుమార్, దూది నర్సింహమూర్తి, నగిరెడ్డి రమణ, దాసరి కుమార్, ఉప్పులూరి కిరణ్, కాళ్ల సీతారాం, కోడిగుడ్డు రమణ, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు



మన్మోహన్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న చిక్కాల రామారావు, తదితరులు



యలమంచిలిలో మన్మోహన్ సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కన్నబాబురాజు

యలమంచిలి రూరల్:మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు అభిప్రాయపడ్డారు. శుక్రవారం యలమంచిలి గాంధీనగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాన్ని పదేళ్లు తన ప్రతిభతో చక్కగా నడిపించిన మన్మోహన్ సింగ్ తన హయాంలో ఎన్నో సంస్కరణలకు ఆద్యుడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, దూది నర్సింహమూర్తి, గొట్టు ముక్కల శ్రీనుబాబు, కిశోర్ రాజు, సేనాపతి రాము, లాలం రాము, పిల్లా త్రినాధరావు, కాళ్ల సీతారాం, ఈరిగిల చంటి, దాసరి కుమార్, దుంగా అచ్యుతరావు, కోడిగుడ్డు రమణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

పాయకరావుపేట: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు సంతాపం తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వై జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రా పటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల్లో కీలక పాత్ర పోషించారని, దేశ ఆర్థిక విధానంపై బలమైన ముద్ర వేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ గెడ్డమూరి నీలమేణి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, టౌన్ ప్రెసిడెంట్ ధనిశెట్టి మహేష్, ఎంపీటీసీ కొంతం నరేష్, పద్మారావు, పోసిన వీరబాబు, గుల్లా నాగు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: తిమ్మరాజుపేట జంక్షన్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి తనకాల అనంతరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం.వి.రాహుల్, చోడపల్లి సుభద్రరావు, కాండ్రేగుల సంజీవ్, ఎల్లపు రాము, భీశెట్టి పెంటారావు, శరగడం జోగినాయుడు, భీశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 15 గొర్రెలు మృతి
- కుక్కల జీభత్సంతో మిగతావి పరారీ



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

రాంబిల్లి(యలమంచిలి): మండల కేంద్ర రాంబిల్లిలో ఓ కొబ్బరి తోటలో సేంద్రియ ఎరువుల కోసం ఏర్పాటు చేసిన గొర్రెల మందపై శుక్రవారం వీధి కుక్కలు రెచ్చిపోయి దాడిచేశాయి. ఈ ఘటనలో 15 గొర్రెలు మృతి చెందగా.. కుక్కల చేసిన బీభత్సానికి భయాందోళన చెందిన మిగిలిన గొర్రెలు పరారయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి రాంబిల్లి మండలం గోవింద పాలెంకు చెందిన బాధిత రైతు ఇసరపు రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమణ తన గొర్రెలను రాంబిల్లిలో ఒక కొబ్బరి తోటలో మంద కాశారు. గొర్రెల చుట్టూ రక్షణగా ఇనుప కంచె ఉన్నా వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. 15 గొర్రెలపై విచక్షణారహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. మందలోని మిగతా గొర్రెలు భయాందోళనకు గురై పరారయ్యాయని బాధిత రైతు వాపోయాడు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా గొర్రెల పెంపకం దారుల సంఘం నాయకుడు జి.దేముడునాయుడు కోరారు.

జేపీ అగ్రహారంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని జేపీ అగ్రహారంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు

మునగపాక: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోలేని రైతులకు సంబంధించిన సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, రీ-సర్వే డీటీ పడాల్, మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు, పలువురు రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

వేమగిరిలో 5 అర్జీల స్వీకరణ

ఎస్.రాయవరం: మండలంలో వేమగిరి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఐదు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు నిర్వహించిన ఈ సదస్సులో గత ప్రభుత్వంలో రీసర్వే కార్యక్రమం పూర్తి స్థాయిలో నిర్వహించడంతో రైతుల భూసమస్యలు చాలా వరకు పరిష్కారమైనట్టు పలువురు అభిప్రాయపడ్డారు.

ఆరు నెలల కూటమి పాలనలో కరెంట్ షాక్‌లు



మునగపాకలో ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, నాయకులు, తదితరులు

మునగపాక: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మునగపాకలో ఆందోళన చేశారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపులో భాగంగా ప్లకార్డులు, బ్యానర్‌లతో ప్రదర్శనగా వెళ్లి స్థానిక విద్యుత్ శాఖ ఏఈ గోపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్న చంద్రబాబుకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు తిరగక ముందే జనం జేబులకు చిల్లులు పడేలా కరెంట్ చార్జీలను పెంచేసిందన్నారు. పెంచిన చార్జీలు తగ్గించాలని, లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మళ్ల సంజీరావు, దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, మొల్లేటి నారాయణరావు, దొడ్డి వరహా, దొడ్డి బుజ్జి, నరాలశెట్టి తాతారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, లంబా అప్పారావు, శరగడం జగన్నాథరావు, కాండ్రేగుల జగన్, ఇల్లా నాగేశ్వరరావు, ధన శ్రీను, బొడ్డేడ జగ్గప్పారావు, రాపేటి పరమేష్, నరేంద్ర, రామజోగినాయుడు, సత్యనారాయణ, భూలేక, భీశెట్టి గంగప్పలనాయుడు, కారుకొండ రాజు, గుంట్ల అప్పారావు, చదరం నాయుడు, పెంటకోట హరేరామ, పెంటకోట అప్పలనాయుడు, దిమ్మల అప్పారావు, రవీంద్రరాజు పాల్గొన్నారు.

ఎస్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి



సమావేశమైన పీఆర్‌టీయూ నాయకులు

పాయకరావుపేట: స్కూల్ అసిస్టెంట్లలో 40 శాతం మందికి జేఎల్‌గా పదోన్నతులు కల్పించాలని అనకాపల్లి జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు డి.గోపీనాథ్ కోరారు. పాయకరావుపేటలో శుక్రవారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలని, ఆదివారాల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులకు నూతన సంవత్సరం కానుకగా స్టేషనరీ అండ్ లంచ్ బ్యాగులు అందజేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు ఎ.వి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, వీరభద్రరావు, ఉమామహేశ్వరరావు, జోగిరాజు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న దీపాలంకరణ



దీపాలంకరణ చేస్తున్న భక్తులు

అచ్యుతాపురం: మేలుకొలుపు కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం మండలం హరిపాలెం-అందలాపల్లి రామాలయంలో శుక్రవారం తెల్లవారుజామున శ్రీరామ బాణం ఆకారంలో చేపట్టిన దీపాలంకరణ ఆకట్టుకుంది. దుష్ట శక్తులను పారద్రోలేందుకు దీపాలంకరణ చేశామని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ తెలిపారు. ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, మోహన్‌రావు, రమణ అప్పారావు, గాంధీ సూరప్పారావు, సన్యాసిరావు, వెంకునాయుడు, భవానీ, ఆదిలక్ష్మి, రమణ, కుమారి వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


'మధ్యాహ్న' పథకానికి స్టీల్ సామగ్రి కొనుగోలు



కొనుగోలు చేసిన స్టీల్ సామాన్లు చూపిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే నెల 3వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నట్టు ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఆర్.టి.సుజాత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కళాశాల అభివృద్ధి నిధులతో విద్యార్థుల సంఖ్య ప్రకారం 270 స్టీల్ కంచాలు, గ్లాసులు, ఇతర వంట సామాన్లు బేసిన్లు, గరెట్లు, బకెట్లు కొనుగోలు చేసినట్టు తెలిపారు. వీటికి రూ.45 వేలు వినియోగించామన్నారు. 1974-75 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ పథకానికి హాట్ బాక్సులను వితరణగా అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం నారాయణరెడ్డి, అధ్యాపకులు కొండబాబు, జయరావు, సిబ్బంది వీరబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజాధిరాజ వాహనంపై వెంకన్న తిరువీధి



రాజాధిరాజ వాహనంలో స్వామికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాజాధిరాజ వాహనంలో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామికి, గోదాదేవి అమ్మవారికి నిత్యార్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని రాజాధిరాజ వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురాలను విన్నపం చేశారు. తదుపరి నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు వరప్రసాద్, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు సాయి ఆచార్యులు పాల్గొన్నారు.